క్లుప్తంగా

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



పూలమాలేసి నివాళులర్పిస్తున్న సతీష్‌రావు తదితరులు

కూకట్‌పల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సందర్భంగా క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఉషా ముళ్లపూడి ఆర్చ్ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ మెంబర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



అడ్మిషన్ కోసం హాజరైన విద్యార్థులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, ఏఅండ్‌టీ, పీఎస్‌టీ గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బుధవారం విద్యార్థులు అధిక సంఖ్యలో అడ్మిషన్ కోసం వచ్చారని ఆయన తెలిపారు.

పోలీస్ వాహనాల పరిశీలన



బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణ కొరకు ఉపయోగించే 5 పోలీస్ వాహనాలు, 3 ద్విచక్ర వాహనాలను బాలానగర్ సీఐ టి నరసింహ రాజు బుధవారం పరిశీలించారు. సర్వీసింగ్, కండిషన్ తీరును డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్‌లో రూ.40 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. శివశంకర్ నగర్ కాలనీ నుంచి ఎల్‌బీ శాస్త్రీ నగర్‌లో ఉన్న ఎస్టీపీ వరకు కలిసే విధంగా పనులు ప్రారంభించామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో విజయ్, పాండుగౌడ్, బసవరాజ్, సాయినాథ్‌గౌడ్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్, పర్వత్‌నగర్‌లో పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు మస్తాన్ రెడ్డిని ఆలయ నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రవీందర్, పల్లపు వేణు, రావుల మహేందర్, లడ్డు, చందు, సురేందర్, రాము, జకీర్, ఆది నారాయణ, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

పేరుకుపోతున్న వ్యర్థాలు • దుర్వాసనతో కాలనీల ప్రజలు అవస్థలు • పట్టించుకోని అధికారులు

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో రహదారుల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దీంతో కాలనీ ప్రజలు, రోడ్ల వెంట ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో చెత్తను సరైన సమయానికి తరలించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కూకట్‌పల్లి మసీదు వద్ద చెత్తా చెదారంలోని వ్యర్థాలను తింటున్న మూగజీవాలు

ఆల్విన్‌కాలనీ: ఇళ్లల్లో, వ్యాపార సముదాయాల్లో, తోపుడు బండ్ల వ్యాపారస్తులు సైతం చెత్తా చెదారాన్ని రోడ్ల పక్కన, కూడళ్ల వద్ద, పార్కుల వద్ద వేస్తున్నారు. దీంతో దుర్గంధం, దుర్వాసనతో అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. గతంలో చెత్తను రోడ్ల వెంట వేయకుండా డస్ట్‌బిన్‌లను తొలగించి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి సేకరించేవారు. దానిని పట్టించుకోకపోవటంతో తిరిగి ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాన్ని పడవేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు వద్ద, వెల్ఫేర్ కార్యాలయం దగ్గర, బాలకృష్ణానగర్‌లో, ఆల్విన్‌కాలనీ నాలా బ్రిడ్జిపైన, ఎల్లమ్మ బండ మెయిన్ రోడ్డులో, ఏఎస్‌డీ స్కూల్ సమీపంలోని నాలా బ్రిడ్జిపైన, కూకట్‌పల్లి గ్రామంలో, హైదర్‌నగర్‌లో ఈ విధంగా పలు ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు.

- కొద్ది రోజుల క్రితం 'సాఫ్ హైదరాబాద్. షాన్‌దార్ హైదరాబాద్' పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పొంచి వున్న ముప్పును వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అవగాహన కల్పించారు. ఖాళీ స్థలాలు, నాలాలు, పార్కులు, రోడ్ల పక్కన పేరుకు పోయిన కొన్ని లక్షల మెట్రిక్ టన్నుల చెత్తా చెదారాన్ని, వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు తరలించారు. కానీ ఈ స్ఫూర్తి కూడా ప్రజల్లో ఎక్కువ రోజులు లేకుండా పోయింది. బహిరంగ ప్రదేశాలు, రహదారులు, నాలాలు, పార్కులు, మూల మలుపులు, ప్రధాన కూడల్లో చెత్తా చెదారాన్ని వేస్తుండటంతో అన్ని ప్రాంతాలు దుర్గంధం, దుర్వాసనతో అధ్వానంగా మారుతున్నాయి. అధికారులు, సంబంధిత సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.



ఆస్‌బెస్టాస్ కాలనీలో రోడ్డుపై వేసిన చెత్తాచెదారం

- చెత్త సేకరించే కార్మికులకు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకునేందుకు చెత్తా చెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఇళ్లలోని చెత్తా చెదారాన్ని, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలి. ఒక్కో ఇంటి నుంచి నెలకు సుమారు 100 నుంచి 150 రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. వీటిని తప్పించుకోవటానికి కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చెత్తా చెదారాన్ని ఆవులు, గేదెలు, మేకలు, ఇతర జంతువులు తిని ఆరోగ్యం దెబ్బతిని మృతి చెందుతున్నాయి. ఈ చెత్తా చెదారం వల్ల మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.



కార్మికులకు వెల్ఫేర్ కార్డులు అందజేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ కార్డులను అందజేయాలని టీపీసీసీ లేబర్‌సెల్ జిల్లా అధ్యక్షులు కందాడి సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ప్రతి నియోజకవర్గంలో కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కార్మికులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో సప్పిడి భాస్కర్, కర్కల ఉపేందర్ రెడ్డి, కావలి గోపాల్, సంపత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్, 5వ ఫేజ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు ముక్కంటి, ప్రధాన కార్యదర్శి అనంత్ రెడ్డి, సభ్యులు వీవీ రావు, రాజు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, సొసైటీ సభ్యులు

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గుణపాఠం

టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిన నాయకులు



ఆల్విన్ కాలనీలో టపాసులు కాలుస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ప్రారంభం కావడంతో ప్రజలు సంబురాలు నిర్వహించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపు దాడులు చేసి ధ్వంసం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ వద్ద కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ నాయకులతో బుధవారం సంబురాలు నిర్వహించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం జరిగిందన్నారు.

స్వీట్లు పంచిన విద్యార్థి నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా మిఠాయిలు పంచారు. ఉపకులపతి టి. కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీవి నరసింహారెడ్డిని కలిసి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో రాహుల్ నాయక్, శివకృష్ణ, సంగెం సిరి, పూల అరవింద్, అర్జున్, అనీష్, సోను, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూహెచ్‌లో స్వీట్లు పంచుతున్న విద్యార్థులు

శ్రీవాసవీ మాత జన్మోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: శ్రీ వాసవి మాత జన్మదిన మహోత్సవం, 19వ వార్షికోత్సవం సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు లక్ష పుష్పార్చన, మూల మంత్ర హోమం, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవాసవి మాత అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. వేడుకలు ఆలయ చైర్మన్ సి. కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగాయి.



హోమంలో పాల్గొన్న భక్తులు

ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నేషనల్ ఏజెన్సీ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించారు. దీంతో బుధవారం కూకట్‌పల్లి కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ అభినందించారు. వివిధ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేట్‌లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు ఎంఏ తెలుగు, కెమిస్ట్రీ, లైఫ్‌సైన్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులు మోహన్‌బాబు, రామకృష్ణ సూర్య, అస్మా బేగం, లావణ్య, బాలాజీలను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, తెలుగుశాఖ అధ్యక్షులు లక్ష్మయ్య, కాశీరాం, లైఫ్ సైన్స్ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌పై అవగాహన

కూకట్‌పల్లి జోన్‌బృందం : వైమానిక దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో పోలీస్ అధికారులు బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అల్లాపూర్, బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు చోట్ల పోలీస్, ట్రాఫిక్ అధికారులు సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. బాలానగర్‌లోని నర్సాపూర్ చౌరస్తాలో డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఏదైనా అవసరం వస్తే పోలీసులు, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ సీఆర్‌పీఎఫ్ అధికారుల సహాయం పొందవచ్చన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. జేఎన్‌టీయూ చౌరస్తాలో ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద కూకట్‌పల్లి సీఐ రాజేష్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. లాంగ్ సైరన్ వచ్చినప్పుడు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.



జేఎన్‌టీయూ చౌరస్తాలో అవగాహన కల్పించిన ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య



నర్సాపూర్ చౌరస్తాలో మాక్ డ్రిల్ నిర్వహించిన డీసీపీ సురేష్ కుమార్, ఎయిర్ ఫోర్స్ అధికారులు తదితరులు

అనుమతి లేని ఆసుపత్రులు..

అడ్డగోలు వసూళ్లు..

ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ
- మొక్కుబడి తనిఖీలతో కాలం వెళ్లదీస్తున్న వైద్యశాఖ
- కొన్నింటిపై ఉదాసీనత
- ఇష్టారీతిన ఫీజుల వసూళ్లు
- రోగులకు తప్పని తిప్పలు

సాక్షి,సిటీబ్యూరో:

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకుని రెండు, మూడు బ్రాంచ్‌లు తెరుస్తున్నారు. వాటిపై ఎలాంటి తనిఖీలు, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మెడికల్ షాపునకు కన్సల్టెంట్ క్లినిక్ పేరిట కూడా ఆసుపత్రులు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. అవసరం లేకున్నా వైద్య పరీక్షలు చేస్తూ.. పేదల రక్తం పీల్చుతున్నారు. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదని రోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ,డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు చేపట్టాల్సిన జిల్లా వైద్యారోగ్యశాఖ మొక్కుబడి తనిఖీలతో కాలం వెల్ల దీస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరపి కేంద్రాలకు అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్. డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్‌మేనేజ్‌మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌తో సహా అన్ని రకాల పత్రాలు సరిగా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంది.



అనుమతులు లేని ఆసుపత్రులకు నోటీసులు అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు (ఫైల్)

ప్రత్యేక బృందాలతో దందా..

రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 40 హెల్త్ కేర్ అండ్ పాలీ క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ కేంద్రాలు, ల్యాబ్‌లను తనిఖీ చేసి అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అయినా కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర అంశాలపై ప్రత్యేక బృందంతో ఆరా తీస్తున్న వైద్యారోగ్యశాఖ మామూళ్ల దందాకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతిలేని ఆసుపత్రులు 995 పైనే..

జిల్లాలో దాదాపు 3,835 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో అన్ని రకాల అనుమతులతో కొనసాగుతున్న ఆసుపత్రులు 2,840 మాత్రమే ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 995 పైగా ఉన్నట్లు వైద్యా ఆరోగ్యశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు(బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 58 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 417 ఉన్నాయి. 20 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 594 ఉన్నాయి. అలాగే 1012 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు 280, డెంటల్ ఆస్పత్రులు 66, ఫిజియోథెరపీ సెంటర్లు, 10 రిహాబిలిటేషన్ సెంటర్లు, అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని స్కానింగ్ సెంటర్లు 500పైగా ఉన్నట్లు అంచనా.

ఫిర్యాదు వస్తేనే తనిఖీ చేస్తాం



అనుమతి లేని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు, అధిక ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై ఫిర్యాదులు అందితేనే తనిఖీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 40 ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, వివిధ సెంటర్లను సీజ్ చేశాం. రెండు ఆసుపత్రులకు రూ.5 లక్షల జరిమానా విధించాం. పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. సమయాభావం వల్ల సకాలంలో తనిఖీలు చేపట్టలేకపోతున్నాం.

-డాక్టర్.ఉమాగౌరీ,
డీఎంహెచ్ఓ ,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా